# నిర్బంధకాండ

- పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌ల పోరుబాట
- మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ శ్రేణులను ఎక్కడికక్కడ అరెస్ట్ చేసిన పోలీసులు
- అభివృద్ధి చేసి బిల్లులు అడిగితే అరెస్ట్ చేస్తారా అని ఆగ్రహం

గత పదేళ్లుగా గ్రామపంచాయతీల్లో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు పోరుబాట పట్టారు. తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు ఈ రోజు (సోమవారం) వారు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వాలని అనుకున్న నేపథ్యంలో వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. నిర్బంధించారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లలపై ఉన్న బంగారాన్ని తాకట్టుపెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని వారు తెలిపారు. ఇప్పుడు డబ్బులివ్వాలని అడిగితే ప్రభుత్వానికి ఎందుకంత కోపమన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్ట్ చేయడమా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. చిన్న పనులు చేసిన తమకు బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యమేమిటని ధ్వజమెత్తారు. తక్షణమే బిల్లులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు రాగా వారిని కూడా అరెస్ట్ చేశారు. సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### నందిగామ మండలంలో..

**నందిగామ :** సర్పంచ్‌లుగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జిల్లెల వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు ఆందోళనలకు పిలుపునివ్వడంతో సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితోపాటు మాజీ సర్పంచ్‌లను నందిగామ పోలీసులు అరెస్టు చేశారు.

### కొత్తూరు మండలంలో..

**కొత్తూరు :** పెండింగ్ బిల్లుల కోసం శాంతియుత ప్రదర్శన చేపడితే అరెస్ట్ చేస్తారా అని కొత్తూరు మండల సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు సంతోశ్‌నాయక్ ప్రశ్నించారు. కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

### ఇబ్రహీంపట్నం మండలంలో..

**ఇబ్రహీంపట్నంరూరల్ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి అప్పులపాలైన మాజీ సర్పంచ్‌ల బాధలు వర్ణణాతీతమని మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి అన్నారు. నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సర్పంచ్‌లను ముందస్తు అరెస్టులు చేయటం సరైంది కాదని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ జంగయ్య తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### దోమ మండలంలో..

**దోమ :** మాజీ సర్పంచ్‌లు తమ గ్రామాల్లో అభివృద్ధి పనులను చేసి పెండింగ్ బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు సోమవారం నిరసన తెలిపేందుకు హైదరాబాద్ నగరానికి వెళుతున్న దోమ మండల మాజీ సర్పంచ్‌లను దోమ పోలీసులు మార్గమధ్యంలో అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో..

**బంట్వారం(కోట్‌పల్లి) :** గ్రామాల అభివృద్ధికి తాము అంకితభావంతో పని చేసి, తమ సొంత పైసలు ఖర్చు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని, చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరితే నిర్బంధాలు, అరెస్టులు ఏంటని కోట్‌పల్లి మండలం కరీపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనీల్ దుయ్యబట్టారు. బంట్వారంలో మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నర్సింహులును బంట్వారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

### యాచారం మండలంలో..

**యాచారం :** పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టిన మాజీ సర్పంచులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మొండిగౌరెల్లి మాజీ సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు.

### కడ్తాల్ మండలంలో..

**కడ్తాల్ :** గ్రామపంచాయతీలను అన్ని విధాల అభివృద్ధి చేసి అప్పుల పాలైన సర్పంచ్‌ల బాధలు వర్ణనాతీతమని, పెండింగ్‌లో బిల్లులను చెల్లించాలని అడిగితే అరెస్ట్ చేయడం అన్యాయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వడానికి, సర్పంచ్‌లు ప్రకటించిన పోరుబాట నేపథ్యంలో లక్ష్మీనర్సింహారెడ్డిని సోమవారం ఉదయం ఆయన ఇంటి వద్ద పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### పెద్దేముల్ మండలంలో..

పెద్దేముల్ : తాము సర్పంచులుగా ఉన్నప్పుడు తమ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచులు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టగా.. పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిలో మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు, మారేపల్లి సర్పంచ్ బల్వంత్‌రెడ్డి తదితరులున్నారు.

### పెద్దఅంబర్‌పేట మండలంలో..

పెద్దఅంబర్‌పేట : పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టిన మండలంలోని మాజీ సర్పంచులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

### మంచాల మండలంలో..

**మంచాల :** సర్పంచ్‌లు గ్రామపంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళుతున్న మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్ అన్నారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు బాల్‌రాజ్, జగన్‌రెడ్డి, రఘునాయక్ ఉన్నారు.

### తాండూరు మండలంలో..

**తాండూరు రూరల్ :** తాండూరు మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను సోమవారం కరణ్‌కోట పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టిన సందర్భంగా వారిని అదుపులోకి తీసుకున్నారు.



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

## సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు

- రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం
- ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్, నవంబర్ 4 : సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, నియోజకవర్గంలో రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ, ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ నివాసంలో నిర్వహించిన రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నాలుగో వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాన్ని నాయకులు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. రాధాకృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సహకరించడం, పేదింటి ఆడపడుచులకు వివాహ కానుక, నిరుపేదలకు ఇండ్ల నిర్మాణాలను చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని అడిగిన సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం అక్రమమని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ట్రస్ట్ ద్వారా సేవ చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా రాధాకృష్ణ ట్రస్ట్‌ను స్థాపించామని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ట్రస్ట్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆనాథ ఆడపడుచులకు పెండ్లి కానుకగా రూ.1,00,116తోపాటు తులం బంగారం అందజేస్తామని ప్రకటించారు. ఇటీవల కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో మునిగి చనిపోయిన మహ్మద్ పాషా పెద్ద కుమారుడిని ఇంటర్ వరకు చదివిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మండలంలో వివిధ కారణాలతో మృతిచెందిన 60 బాధిత కుటుంబాలకు ఐదు వేల చొప్పున రూ.3 లక్షలను అందజేశారు. అంతకముందు రాధాకృష్ణ చిత్రపటానికి నాయకులు నివాళుర్పించారు.

కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకురాలు శారద, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజని, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, బీఆర్ఎస్ మండల, గ్రామాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, జేడీఎన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, నవంబర్ 4 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వచ్చిన ప్రజా వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ ఆర్డీవోతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో 132 దరఖాస్తులు రాగా.. అందులో భూ సమస్యలు, ఇతర సమస్యలున్నాయి. స్వీకరించిన వాటిని సత్వరమే పరిష్కరించాలని, వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేకపోతే వారికి తగిన సూచనలివ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు

**వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి**

వికారాబాద్, నవంబర్ 4 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో పేకాట ఆడుతున్నవారిపై దాడులు చేసి 73 మందిపై, ఒక గంజాయి కేసు నమోదు చేసి 500 గ్రాముల గంజాయి కూడా సీజ్ చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లోని బీజేఆర్ చౌరస్తాలో గంజాయి తరలిస్తున్న నిందితుడిని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకొని, 500గ్రా. గంజాయి సీజ్ చేసినట్లు చెప్పారు. వికారాబాద్‌లోని ఫతే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో 6గురు పేకాటరాయుళ్లను టాస్క్‌ఫోర్స్ బృందం అదుపులోకి తీసుకోని రూ.7,900, 3 సెల్‌ఫోన్‌లు సీజ్ చేశారన్నారు. అలాగే అనంత పద్మనాభ షాప్‌లో 12 మంది, రూ.11,630, 6 సెల్‌ఫోన్‌లు., చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బకాపూర్‌లో ఆరుగురు. రూ.10,540, 3 సెల్‌ఫోన్‌లు., కొడంగల్ పరిధిలోని కొండారెడ్డి పల్లిలో 10 మంది, రూ.31,800, 8 సెల్‌ఫోన్‌లు., దౌల్తాబాద్‌లో 10 మంది, రూ.14,680, 10 సెల్ ఫోన్స్., కొడంగల్ పీఎస్ పరిధిలోని కస్తూరిపల్లిలో 8 మంది, రూ.13,930, 5 సెల్‌ఫోన్స్., కొడంగల్‌లో ఆరుగురు, రూ.13,260, 6 సెల్‌ఫోన్‌లు., బొంరాస్‌పేట్‌లో 8 మంది, రూ.14,670, 7 సెల్ ఫోన్స్., తాండూరులో 7గురు, రూ.80,270, 7 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా 9 పేకాట కేసులు నమోదు చేసి 73 మందిని అదుపులోకి తీసుకొని రూ.1,98,780, 55 సెల్ ఫోన్స్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఒక గంజాయి కేసులో 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడినా, ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులుకు సమాచారం అందించాలని ఎస్పీ తెలియజేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 8712670022 ద్వారా సంప్రదించవచ్చన్నారు.

# ఎట్టకేలకు..

- రంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- ఇప్పటికే సగానికి పైగా కోతలు పూర్తి
- 45 కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం చర్యలు

రంగారెడ్డి, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎట్టకేలకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు సిద్ధమైనది. రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వస్తున్న నేపథ్యంలో 45 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే సగం వరకు వరికోతలు పూర్తయ్యాయి. చాలా మంది రైతులు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తక్కువ ధరకే దళారులు, వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోయారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, దండుమైలారం, మంచాల, బోడకొండ, యాచారం, మంతన్‌గౌరెల్లి, కొహెడ, చింతపట్ల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి బాధ్యతలను డీసీఎంఎస్‌కు అప్పగించారు. ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ధాన్యం ప్రారంభించనున్నారు. అలాగే, తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్, పడకల్, గట్టుప్పలపల్లి, తలకొండపల్లి, వెల్‌జాల్, రాంపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయగా వాటి నిర్వహణ పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో జరుగనున్నది. అలాగే మాడ్గులలో ఒకటి, ఆమనగల్లులో ఒకటి చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి బాధ్యతలను పీఏసీఎస్‌లకు అప్పగించనున్నారు. కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్వేన్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వాటి బాధ్యతను ఆమనగల్లు పీఏసీఎస్ చూసుకొనున్నది. నందిగామ మండలంలోని మేకగూడ, షాద్‌నగర్ మండలంలోని షాద్‌నగర్, కేశంపేట మండలంలోని కొత్తపేట, కేశంపేట, చేగూర్ గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి..వాటి నిర్వహణను పీఏసీఎస్‌కు అప్పగించారు. కొందుర్గు మండలంలోని జాకారం, కొందుర్గు, జిల్లెట్‌చౌదర్‌గూడలో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని మల్కారం, పాలమాకులలో ఏర్పాటు చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాచారం, బండరావిరాలలో ఏర్పాటుచేసి హయత్‌నగర్ పీఏసీఎస్‌కు అప్పగించారు. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, శంకర్‌పల్లి మండలం మోకిలలో, మహేశ్వరం, కందుకూరుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహేశ్వరం, కందుకూరు కేంద్రాలను సహకార సంఘాలకు అప్పగించారు.

### ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర

సన్నరకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300పాటు బోనస్ అదనంగా రూ.500, మొత్తం కలిపి రూ.2800 రానున్నది. అలాగే, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 క్వింటాల్‌కు ధరను ప్రభుత్వం ప్రకటించింది.

### నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

నేటి నుంచి జిల్లాలో దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. 45 కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని కొంటాం. రైతుల అవసరాలు, డిమాండ్ అధికంగా ఉంటే అదనంగా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. రైతులకు నిర్ణీత గడువులోపే డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం.

**- గోపీకృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం**

## ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

**ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్ మహరాజ్**

ఆదిబట్ల, నవంబర్ 4 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదిబట్లలో ఆది వారం రాత్రి కేబీఆర్ గార్డెన్‌లో రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజాయుద్ధం చేయడానికి ధర్మసమాజ్ పార్టీ అధ్వర్యంలో తెలంగాణవ్యాప్తంగా 15,000 కిలోమీటర్ల పాదయాత్రను చేపడుతున్నట్లుగా తెలిపారు. తెలంగాణాలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యం రావాలని రాష్ట్ర వ్యాప్తంగా 2025 జనవరి 5న ఆదిలాబాద్ నుంచి తాను మహా పాదయాత్రను ప్రారంభిస్తున్నానని చెప్పారు. ఈ పాదయాత్రను 2028 వరకు కొనసాగిస్తామన్నారు. గతంలో పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రగా చేపట్టి ధర్మసమాజ్ పార్టీని ప్రకటించుకున్నట్లు తెలిపారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ అణగారిన ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం ఉపాధితో పాటు భూమి, ఇండ్లు సాధించేవరకు పోరాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను ప్రకటించి 420 హామీలిచ్చి అడ్డదారిన అధికారంలోకి వచ్చి నియంతపాలన కొనసాగిస్తున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు పూర్తిగా అన్యాయం చేసిందదన్నారు. ధర్మసమాజ్ పార్టీ తెలంగాణాలోని అగ్రకుల పార్టీలపై రాజకీయ యుద్ధం చేసి అణగారిన వర్గాలకు రాజ్యాధికారం అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, ప్రముఖ విద్యావేత్త వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

## సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్**

ఆదిబట్ల, నవంబర్ 4 : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి దరఖాస్తులను ప్రతిమాసింగ్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులు, అర్జీలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి 50 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. రెవెన్యూశాఖకు 43, ఇతర శాఖలకు 7 మొత్తం కలిపి 50 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**

వికారాబాద్, నవంబర్ 4 : గ్రూప్-3 పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ డాంబర్లో గ్రూప్-3 పరీక్షకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించేందుకు వికారాబాద్‌లో 20, తాండూరులో 11 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 10,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇన్విజిలేటర్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీఓఆ పత్రాలను తీసుకువెళ్లేందుకు బందోబస్తు, ఎస్కార్ట్ ఏర్పాట్లను చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలోని పరీక్షాపత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమును అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సమావేశంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రీజినల్ కోఆర్డినేటర్ నరేంద్ర కుమార్, అసిస్టెంట్ రీజినల్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మండలంలోని హస్నాబాద్ గ్రామంలో సినీ నటుడు ప్రభాకర్ (బాహుబలిలోని కాలకేయుడు) స్వగ్రామంలో ఇంటి నిర్మాణం చేపట్టారు. సోమవారం గృహప్రవేశ కార్యక్రమాన్ని చేపట్టడంతో గ్రామానికి ప్రముఖ సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను హాజరయ్యారు. - కొడంగల్, నవంబర్ 4

## సర్వేలో తప్పులు దొర్లకుండా చూడాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్**

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబర్ 4 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ తెలిపారు. సోమవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ఉపాధ్యాయులకు మాస్టర్ ట